## క్లుప్తంగా

### రూ.75 నాణెం సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన రూ.75 నాణెం

**అమలాపురం టౌన్:** భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ పరిధిలో సెంట్రల్ సిల్క్ బోర్డు ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముంబై టంకశాల రూ.75 ప్రత్యేక నాణేన్ని విడుదల చేసింది. ఈ నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు. సెరికల్చర్ పరిశోధన, అభివృద్ధి కోసం ఏర్పడిన సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా దేశంలోని దాదాపు 95 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. ఈ నాణెంపై ఒక వైపు నాణెం ముఖ విలువ, జాతీయ ముద్రను ముద్రించారు. రెండో వైపు సీతాకోక చిలుక ఆకృతితో కూడిన సెంట్రల్ సిల్క్ బోర్డు అధికార ముద్రను ముద్రించారు. 35 గ్రాముల బరువుతో ఉన్న ఈ నాణేన్ని 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారు చేశారని సేకరణ కర్త కృష్ణ కామేశ్వర్ తెలిపారు.

### ఆక్రమణల తొలగింపు



సీతారామపురంలో ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

**తాళ్లరేవు:** మండల పరిధిలోని కోరంగి పంచాయతీ సీతారామపురం ఏటిగట్టు వెంబడి ఉన్న ఆక్రమణలను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. ఏటిగట్టు చెంతన ఉన్న ఖాళీ స్థలాలతో పాటు ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన పాంచాల రేవులను సైతం కొందరు ఆక్రమించి రేకుల షెడ్‌లు, తాటాకులతో నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో సుమారు తొమ్మిది మందికి చెందిన ఆక్రమణలను తొలగించారు. గతంలో జాతీయ రహదారి 216ను ఆనుకుని ఉన్న పలు స్థలాల ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో గ్రేడ్–5 కార్యదర్శి డేవిడ్‌రాజు, వీఆర్వోలు శ్రీను, సూర్యనారాయణ, మహిళా పోలీసులు చంటి, సుజాత, పంచాయతీ సిబ్బంది ప్రసాద్, శ్రీను, నాగేంద్ర పాల్గొన్నారు.

### ఘనంగా క్రిస్మస్ ఆరాధన

**అమలాపురం రూరల్:** మండలంలోని రంగాపురంలో సీయోను ప్రార్థనా మందిరం, ఐపీసీ చర్చి నిర్వాకులు పాస్టర్ స్పర్జన్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ ఆరాధన ఘనంగా జరిగింది. రెవ డాక్టర్ మూర్తీ పాలంగి మాట్లాడుతూ సర్వ మానవుల జీవితంలో సమాధానం నింపడానికి ఏసుక్రీస్తు ఈ లోకంలో జన్మించారన్నారు. క్రైస్తవ భక్తులు క్రీస్తుని ఆరాధించారు. సువార్త గాయనీ, గాయకులు పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు సమకూర్చిన కేకును పాస్టర్లతో కలిసి కట్ చేశారు.

### గోకులం షెడ్ల పరిశీలన

**అమలాపురం రూరల్:** రూరల్ మండలం బండారులంక గ్రామంలో నిర్మిస్తున్న గోకులం షెడ్ల నిర్మాణాన్ని ఎంపీడీవో ఉండ్రు బాబ్జీ రాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడి పశువులకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం షెడ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

### వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

**ఐ.పోలవరం:** మురమళ్ల వీరేశ్వరస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన సాహెట్టి కొండలరావు దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. వీరేశ్వర గోకులానికి పిడుగురాళ్లకు చెందిన దేవరశెట్టి తేజశ్వి రూ.10 వేలు ఆన్‌లైన్‌లో విరాళంగా అందజేశారు.

### జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా ధనలక్ష్మి

**తాళ్లరేవు:** కాకినాడ జిల్లా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా గాడిమొగ పంచాయతీకి చెందిన జల్లి ధనలక్ష్మి ఎన్నికైనట్లు ఏపీఎం విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనలక్ష్మి ప్రస్తుతం తాళ్లరేవు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. ధనలక్ష్మి ఎన్నిక పట్ల సమాఖ్య ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన ధనలక్ష్మికి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, సమాఖ్య ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

### మోటారు సైకిల్ చోరీపై ఫిర్యాదు

**అమలాపురం టౌన్:** మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు శివారు తోట్లపాలేనికి చెందిన కొబ్బరి ఒలుపు కార్మికుడు చవ్వాకుల కృష్ణమూర్తి తన పనిని ముగించుకుని మోటారు సైకిల్‌పై వచ్చి తన ఇంటి ఆవరణలో ఎప్పటి లాగే ఈ నెల 1న పార్కు చేశాడు. తెల్లవారిన తర్వాత ఇంటి ఆవరణలో మోటారు సైకిల్ లేకపోవడంతో వారం, పది రోజులుగా తన మోటారు సైకిల్ ఆచూకీ కోసం వాకబు చేశాడు. ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు.

# మేలైన విత్తనం.. అన్నదాతకు వరం..!

- రబీకి స్వల్పకాలిక రకాలే అనుకూలం
- రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం




గాడిలంక రైతుసేవా కేంద్రంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ రామారావు

**ముమ్మిడివరం:** మంచి విత్తనం ఎంపిక చేసుకోవడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరి విత్తనం రకాల ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు వహించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ప్రస్తుత రబీ సీజన్‌లో 30వేల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు. నూరు శాతం కాలువల ద్వారా ప్రవహించే సాగునీటి ద్వారానే సాగు జరుగుతుంది. రబీలో ముఖ్యంగా స్వల్ప కాలిక రకాలైన ఏంటీయూ, 1064, ఎంటీయూ 1121, ఎంటీయూ 3626, కావేరి వంటి రకాలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఇవి 110 నుంచి 115 రోజులలో కోతకు వస్తుంది. ఈ రకాలు సాగు చేయడం వల్ల నీటి ఎద్దడిని అధిగమించడమే కాకుండా సకాలంలో పంట చేతికొస్తుంది. వివిధ రకాల భూములు, వాతావరణ పరిస్థితులను బట్టి రెండు పంటలు పండించుకొనే ప్రాంతాల్లో మంచి దిగుబడులు ఇచ్చే వరి రకం స్వర్ణ. ఇది తక్కువ నత్రజనితో అధిక దిగుబడిని ఇస్తుంది. పంట చేతికొచ్చే సమయంలో చేలల్లో గింజ మొలకెత్తే స్వభావం తక్కువగా ఉంటుంది. చౌడు భూములలో సాగుకు ఇది అనుకూలంగా ఉంటుంది. ఆరుదల పంటకు అనువుగా ఉండే ఎంటీయూ 9993 రకం వరిని సాగు చేసుకోవచ్చు. రైతు సేవా కేంద్రాలతో పాటు అధీకృత డీలర్ల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. సబ్ డివిజన్ పరిధిలో అన్ని సేవా కేంద్రాల వద్ద విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎస్. ప్రశాంత కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో అవసరాల మేరకు విత్తనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

**కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- గుర్తింపు పొందిన సంస్థలు సర్టిఫైడ్ చేసిన విత్తనాలనే కొనుగోలు చేయాలి
దళారుల ప్రోద్బలంతో విడి విత్తనాలు కొనుగోలు చేయడం నష్ట దాయకం
- వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన డీలరు వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయటం మంచిది.
- విత్తన మొలక శాతం పరీక్షించిన తరువాతే కొనుగోలు చేయాలి
- విత్తనాల సంచితో పాటు లాట్ నెంబర్, కాల పరిమితి తప్పని సరిగా సరి చూసుకోవాలి.
విత్తన సంచిని, ట్యాగ్‌ను, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్ర పరుచుకోవాలి.

**నాణ్యమైన రకాలతో మంచి దిగుబడులు**



మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు. విత్తనాలు మొలక శాతాన్ని పరీక్షించి నారుమడులు వేయాలి. అధీకృత డీలర్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విధిగా డీలరు ఇచ్చే బిల్లులను రైతులు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. రబీ సీజన్‌లో స్వల్ప కాలిక రకాలు అనుకూలంగా ఉంటాయి.

ఎస్.ప్రశాంత్ కుమార్,
వ్యవసాయాధికారి, ముమ్మిడివరం.

### ఆరోగ్యకర అలవాట్లతో రోగాలు దూరం



బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న రమేష్ తదితరులు

**తాళ్లరేవు:** ఆరోగ్యకర అలవాట్లతో రోగాలకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్ అన్నారు. మంగళవారం తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో రోగ నిరోధక శక్తి క్షీణించిన వారికి కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రమం తప్పకుండా మందులు వాడుతూ పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్యకర అలవాట్లతో రోగ నిరోధక శక్తిని పెంపొందించు కోవచ్చన్నారు. మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందజేసే వైద్య సేవలపై చైతన్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటీఎస్ఎల్ ఈపీ వై.చక్రధర్, దిశా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కేవీఆర్ శైలజ, జిల్లా సూపర్‌వైజర్ ఏ.బుజ్జిబాబు, మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ కోఆర్డినేటర్ రాజు, మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగ నిరోధక శక్తి క్షీణించిన 45 మందికి పౌష్టికాహార కిట్లను అందజేశారు.

## మాలల మహాగర్జన విజయవంతానికి పిలుపు



అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు ప్రదర్శిస్తున్న మాల మహానాడు నాయకులు



ఎస్.యానంలో చలో గుంటూరు గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

**ఐ.పోలవరం:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని దీనిని అడ్డుకునేందుకు నిర్వహిస్తున్న మాలల మహా గర్జనను విజయవంతం చేయాలని ఐ.పోలవరం మండల మాల మహానాడు కోరింది. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం దీనికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. మండల మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు జన సమీకరణ పెద్ద ఎత్తున చేయాలని కోరారు. గుంటూరు సభను విజయవంతం చేయడం ద్వారా మాలల సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డి గౌతమ్, మట్ట గగన వీరుడు, దుక్కపాటి సత్య నారాయణ, కాశి శోభన బాబు, రామకృష్ణ, భీమారావు, జల్లి శ్రీను, కాత్రు శ్రీను, పెయ్యల పరుశురాముడు పాల్గొన్నారు.

**గుంటూరు సభకు తరలి రావాలి**

**ఉప్పలగుప్తం:** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల సింహ గర్జనకు భారీగా జనం తరలి రావాలని వర్గీకరణ వ్యతిరేక జిల్లా కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్.యానం గ్రామంలోని వేదాంత కంపెనీలో పనిచేసే దళిత కార్మికులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగలను విడదీస్తున్నారని అది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ సందర్భంగా చలో గుంటూరు వాల్ పోస్టర్‌ను కార్మికుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరి మోహన్‌బాబు, రేవు తిరుపతిరావు, పెట్టా మురళీకృష్ణ, ముత్తాబత్తుల శ్రీను, పాలమూరి కాటయ్య, జొన్నాడ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన భారతీయ సంస్కృతీ ఉత్సవ్

- అలరించిన విద్యార్థుల సంప్రదాయ ప్రదర్శనలు

**అమలాపురం టౌన్:** స్థానిక యర్రమిల్లి వారి వీధి హనుమాన్ మందిర్ వద్ద ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న భారతీయ సంస్కృతీ ఉత్సవ్–2024 పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. రెండో రోజు కూడా ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులు పలు అంశాలపై చేపట్టిన సంస్కృతీ సంప్రదాయ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా వందలాది మంది విద్యార్థులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు. మన సంస్కృతిని ప్రతిబింబించేలా, మన సంప్రదాయాలకు అద్దం పట్టేలా పోటీలతో కూడిన ప్రదర్శనలు చేపట్టారు. రెండో రోజు వందేమాతరం బృంద గానాలు, సనాతనంపై జరిగిన క్విజ్ పోటీలు, జానపద, కూచిపూడి నృత్యాలు, భగవద్గీత, రామాయణం శ్లోకాల పోటీలు, పలు పురాణ దేవుళ్లు, దేవతల వేషధారణలు, మన సంప్రదాలయాను గుర్తు చేసే పాత్రలకు అనుగుణంగా వేష ధారణల్లో విద్యార్థులు రంజింపజేశారు. ముఖ్యంగా విద్యార్థులకు మట్టితో బొమ్మలు తయారు చేయడంపై ఆసక్తి కల్పిస్తూనే వారి మధ్య పోటీలు నిర్వహించి మన సంస్కృతిని అలవరిచే ప్రయత్నం చేశారు. పోటీలకు సంబంధించి విజేతలకు ఈ నెల 12న హనుమాన్ మందిర్ వద్ద బహుమతుల ప్రదానం ఉంటుందని ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ తెలిపారు. ట్రస్ట్ ప్రతినిధులు యు.శివకృష్ణ, చాణక్య, తేజస్విని, లావణ్య, కౌటిన్య, యశస్విని, భరద్వాజ్ తదితరులు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సేవలు అందించారు.



పోటీల్లో మట్టి బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు

### బకాయి వేతనాలు చెల్లించాలి

**తాళ్లరేవు:** స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు బకాయి వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీపీఎం మండల కమిటీ కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వీరికి నెలల తరబడి బకాయి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. వేతనాలు అందక వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాల బిల్లును తక్షణమే విడుదల చేయాలని కోరారు.

## ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న దివ్యాంగులు

**అమలాపురం రూరల్:** కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం వారోత్సవాలు సందర్భంగా మంగళవారం అమలాపురం మండలం ఈదరపల్లిలో హరి మనో వికాస కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు పీఎస్.సురేష్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్. గిరీష ఆదేశాల మేరకు ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. దివ్యాంగులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పరుగు పందెం, వాలీబాల్, బాస్కెట్ బాల్ వంటి పోటీలు నిర్వహించారు. పీఈటీలు, హరి మనో వికాస కేంద్రం మేనేజర్ ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కాట్రేనికోన:** చెయ్యేరు జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. భవిత కేంద్రం ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా డీవైఈఓ జి సూర్య ప్రకాష్ హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు ఉన్నత శిఖరాలను అందుకుంటారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారులు లక్ష్మీనారాయణ, వెంకటరమణ, సర్పంచి చెల్లి సురేష్, తదితరులు ఉన్నారు.

### కొనసాగుతున్న నిరసన

**అమలాపురం టౌన్:** అమలాపురం మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ డోర్, ఇన్‌డోర్ సిబ్బంది 54 మంది తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె మంగళవారంతో రెండో రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రెండో రోజు సైతం నిరసన తెలిపారు. తమకు భద్రత కల్పిస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణిలను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం కలిసి తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఉద్ఘాటించారు.

### ధూళిపూడికి మాతృ వియోగం

**తాళ్లరేవు:** మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్ మాతృమూర్తి ధూళిపూడి లక్ష్మీ నరసమ్మ(73) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్, నాయకులు దున్నా జనార్ధనరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, పంపన రామకృష్ణ, మట్టపర్తి లోవరాజు, టిల్లపూడి నాగేశ్వరరావు, ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ధూళిపూడి గొల్లబాబు, విళ్ల వీర, ఆకుల వెంకటేశ్వర్లు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సీనియర్ పెన్షనర్లకు సత్కారం



కృష్ణశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న ట్రెజరీ అధికారి రంగారావు, ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** స్థానిక ఏవీఆర్ నగర్‌లో గల జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సాధారణ సమావేశం అసోసియేషన్ భవనంలో మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు పారుపూడి కృష్ణ శాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్థానిక ట్రెజరీ అధికారి వీవీ రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 17న జరగనున్న పెన్షనర్స్ డేను పురస్కరించుకుని 1944– 1945 మధ్యకాలంలో జన్మించిన సీనియర్ పెన్షనర్లు 40 మందికి అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణశాస్త్రి దంపతులను సత్కరించి అభినందించారు. సీనియర్ పెన్షనర్లు అయ్యగారి రామచంద్రమూర్తి, జొన్నలగడ్డ కృష్ణారావు, త్సవటపల్లి సత్యనారాయణమూర్తి, గండుపోగుల భాస్కరరావుతో పాటు 40 మంది సీనియర్ పెన్షనర్ల దంపతులకు సత్కారాలు చేశారు. పెన్షనర్లకు ప్రభుత్వ పరంగా పలు సేవలు అందిస్తున్న ట్రెజరీ అధికారి రంగారావును సైతం అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. అసోసియేషన్ కోశాధికారి జయంతి శర్మ సమావేశంలో అసోసియేషన్ నివేదికను సమర్పించారు. అసోసియేషన్ ప్రతినిధులు యర్రమిల్లి పాండురంగారావు, ఎండీ షహీరా తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల కన్నా అధికారులే ఎక్కువ!



ఈదరపల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఉద్యోగులు



ఉప్పలగుప్తంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ దివాకర్

**అమలాపురం రూరల్:** అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీదారులు కన్నా అధికారులు, ఉద్యోగులే ఎక్కువ మంది కనిపించారు. ఈదరపల్లి సచివాలయం వద్ద తహసీల్దార్ కిషోర్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజలు అధికారులకు సమస్యలు మొర పెట్టుకున్నారు. పలువురి సమస్యలకు అధికారులు పరిష్కారం చూపారు. 9 మంది అర్జీదారులు ఫిర్యాదులు అందించారు. వాటిలో నాలుగు సమస్యలను తక్షణమే పరిష్కరించారు.

**రెవెన్యూ సదస్సుకు 46 అర్జీలు**

**ఉప్పలగుప్తం:** మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో తహసీల్దార్ వి.ఎస్.దివాకర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 46 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ దివాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారం అయ్యేలా చూస్తామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, నల్లా వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ ఎంఏ షంషి, ఎంపీడీవో పి.రాజ్ కుమార్, ఆర్ఐ లలిత, వీఆర్వోలు షేక్ అహ్మద్ అలీషా, గనిశెట్టి వీరవేణి, మమత, ఏ.రాము, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**తాడికోనలో రెవెన్యూ సదస్సు**

**అల్లవరం:** భూ సంబంధిత సమస్యల పరిష్కార వేదికగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి కె.మూర్తి అన్నారు. తాడికోనలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో సర్పంచ్ సాధనాల సూర్య వెంకట నాగమణి అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు 17 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

### మొబైల్ షాప్‌లో అగ్ని ప్రమాదం

**యానాం:** యానాం న్యూ బస్టాండ్ ఎదురుగా పద్మా థియేటర్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న రాజ్‌కుమార్ మొబైల్ షాప్‌లో మంగళవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. షాప్‌లో అగ్ని కీలలు వ్యాపిస్తుండటంతో స్థానికులు అగ్నిమాపక దళ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఖరీదైన మొబైల్ ఫోన్‌లు, యాక్సరీస్, కంప్యూటర్ తదితరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు షాపు యజమాని సన్నీడి గుప్తా తెలిపారు. ప్రమాదం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిందని భావిస్తున్నట్లు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ మీరాసాహెబ్ తెలిపారు.




అగ్ని ప్రమాదంలో దగ్ధమైన సెల్‌ఫోన్‌లు

### వెంకటేశ్వరరావుకు హ్యూమన్ రైట్స్ అవార్డు

**ఐ.పోలవరం:** అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడలో జరిగిన మానవ హక్కుల సభలో డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు ప్రతిభా భాస్కర్ అవార్డు అందుకున్నారు. కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ మహాసభలో ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. ఐ.పోలవరంలో అధికారులు, నాయకులు, ప్రజ్ఞా సాహితి, విద్యాసంస్థలు ఆయనను అభినందించాయి.

### కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న వేదిక ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** ఉభయ తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహా సభలు అనంతపురంలో ఈ నెల 14, 15వ తేదీల్లో జరుగుతాయని అమలాపురానికి చెందిన ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ తెలిపారు. ఈ సభల కరపత్రాలు, పోస్టర్లను స్థానిక మానవ హక్కుల వేదిక కార్యాలయంలో వేదిక ప్రతినిధులు మంగళవారం విడుదల చేశారు. మహాసభలకు జిల్లా నుంచి మానవ హక్కుల వాదులు హాజరై విజయవంతం చేయాలని వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ విజ్ఞప్తి చేశారు. మానవ హక్కుల ఉల్లంఘన, కులగణన, కార్పొరేటీకరణ, కాషాయీకరణ తదితర అంశాలపై మహాసభలో జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు వివరిస్తారని వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్ తెలిపారు. మానవ హక్కుల వేదిక ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, ఎల్‌బీఎస్ నారాయణ, బీఎస్పీ నాయకుడు ఆకుమర్తి భూషణం పాల్గొన్నారు.

### సీఎం రంగసామికి బాధితుల వినతి



సీఎం రంగసామికి వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి, బాధితులు

**యానాం:** పట్టణ పరిధిలో బైపాస్ రహదారిని ఆనుకుని ఉన్న వ్యాపార సముదాయాలను తొలగించేలా ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో బాధితులు మంగళవారం సీఎం రంగసామిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బైపాస్ రహదారిలో వ్యాపార సముదాయాలు తొలగించాలని కోర్టు తీర్పు తమకు సైతం వర్తింపజేసేలా ఉందని తమకు రక్షణ కల్పించాలని ఫెర్రీరోడ్డులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉన్న సుమారు 1300 కుటుంబాలు వినతిపత్రం అందజేశారు. ఈ కేసును వాదించేలా సీనియర్ న్యాయవాదిని నియమించాలని సీఎం రంగసామి ఆదేశించారని మల్లాడి తెలిపారు. బైపాస్, ఫెర్రీరోడ్డు నివాసితులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవాదాయ ధర్మాదాయ శాఖ

**"ఇ" ప్రొక్యూర్ మెంట్ టెండరు ప్రకటన**

డా॥ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని, ఉప్పలగుప్తం మండలం, భీమనపల్లిలో యున్న శ్రీ అనంగేశ్వర స్వామి దేవస్థానం వారు ఈ క్రింది పని నిమిత్తం టెండర్ పిలవబడుచున్నది.

| | | | |
|---|---|---|---|
| 1. | Repairs to Mukamandapam | టెండర్ id .773440 | Rs.2.40 Lakhs |

బిడ్ డాక్యుమెంట్ తేది. 09.12.2024 రాత్రి గం.10.00 PM నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండరు దాఖలు చేయుటకు ఆఖరి తేది. 24.12.2024 ఉదయం గం.10.30 AM వరకు, మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.

సం/- **ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు,**
**శ్రీ అనంగేశ్వర స్వామి దేవస్థానం, ఫోన్ నెం: 7780569965**

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
బ్యాంక్ స్ట్రీట్ బ్రాంచ్, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు, ఋణగ్రహీతల చిరునామా: శ్రీమతి రాకుర్తి సురేఖ, భర్త : సూర్య ప్రకాష్, డి.నెం. 3–528, పేరమ్మ అగ్రహారం, ఎత్తు రోడ్డు, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా. శ్రీ రాకుర్తి సూర్య ప్రకాష్, తండ్రి : వీర రాఘవ, డి.నెం.3–528, పేరమ్మ అగ్రహారం, ఎత్తు రోడ్డు, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా. (HL, Suraksha. Account No. 37372545867, 37378851233)

సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(2) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి తేది. 19–06–2024న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది. 19–06–2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ. 20,77,345/- (అక్షరాల ఇరవై లక్షల డెబ్బై ఏడు వేల మూడు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) + తేది. 20.06.2024 నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది. 21.08.2024న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది. 27-08-2024న (ఈనాడు : అమలాపురం క్లస్టర్ ఎడిషన్ (తెలుగు) మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్: తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్)) దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులపై గల తేది. 19-06-2024న డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల సదరు ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్ల సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

శ్రీమతి రాకుర్తి సురేఖ, భర్త : సూర్య ప్రకాష్ గారికి చెందిన ఆస్తి: తూర్పుగోదావరి జిల్లా, మండపేట మండలం, ద్వారపూడి గ్రామ పంచాయితీ, వేములపల్లి ఏరియా, అనపర్తి ఎస్ఆర్ఓ, జిరాయితీ మెట్ట ఆర్.ఎస్.నెం.204/2 లోని ఏ.5.17 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో ఏ.1.73 సెంట్లు మొత్తంలో 890.5 చ॥గజాల విస్తీర్ణం పడమర వైపు 1/20వ అవిభాజ్య వాటా (44.52 చ॥గజాలు) (Lr.D.Dis No. 3447/2014/R1 Dt. 03.01.2015, B.L.R.No. 31/14-15 Dt.16.3.2015) తో గల "విష్ణు టవర్స్" స్టిల్ట్ జి + 4 యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : తంల కృష్ణరామ్ గారి ప్రహరీ గోడ - 86'00", దక్షిణం : 40 అడుగుల వెడల్పు నడక దారి - 93'02", పడమర : తంల విష్ణుమూర్తి గారి ఆస్తి - 86'00", ఉత్తరం : తంల కృష్ణరామ్, తంల విష్ణు మూర్తి గార్ల ఆస్తి - 93'02".

తూర్పుగోదావరి జిల్లా, మండపేట మండలం, ద్వారపూడి గ్రామ పంచాయితీ, వేములపల్లి ఏరియా, అనపర్తి ఎస్ఆర్ఓ వద్ద డి.నెం.15-18 లోని 890.5 చ॥గజాల విస్తీర్ణంలోని "విష్ణు టవర్స్" (స్టిల్ట్ జి + 4) నాల్గవ అంతస్తు నందు (1050 చ॥అ॥ల బిల్టప్ ఏరియా, బాల్కానీలు, కార్ పార్కింగ్ & కామన్ ఏరియాలతో సహా) నివాస ఫ్లాట్ నెం.402తో గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.

తేది: 10-12-2024
ప్రదేశం: అమలాపురం

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా